క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: విద్యుత్తు మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని జేఎల్‌బీ కళాశాల రోడ్డు, మసీద్ రోడ్డు, బస్టాండ్ నుంచి విద్యుత్తు కార్యాలయం వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పట్టణ ఏఈ ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భట్టిప్రోలులో..

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పల్లెకోన ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ పి. ఏడుకొండలు సోమవారం తెలిపారు. మండలంలోని వేమవరం దగ్గర నుంచి సూరేపల్లి, కోనేటిపురం, పల్లెకోన వరకు ఉన్న గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు మార్పును గమనించాలని కోరారు.

స్పందనకు ఆరు అర్జీలు

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమానికి ఆరు అర్జీలు అందినట్లు ఆర్డీవో హేలా షారోన్ తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. నివేసన స్థలం పక్కన ఉన్న పోరంబోకు ఆక్రమణలు తొలగించాలని కొల్లూరు మండలం కిష్కిందపాలెం నుంచి అర్జీ అందగా అదే మండలంలోని అనంతవరం గ్రామంలో భూములలో ప్రభుత్వ ఆక్రమణలు తొలగించాలని మరో అర్జీ అందిందన్నారు. భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామం నుంచి ఆర్అండ్‌బీ రహదారి పక్క ఉన్న ఆక్రమణలు తొలగించాలని కోరుతూ అర్జీ అందగా, అదే గ్రామం నుంచి స్మశాన వాటికను మంజూరు చేయాలని మరో అర్జీ అందిందన్నారు. పొలాన్ని ఆన్‌లైన్ చేయాలని రేపల్లె మున్సిపాలిటీ నుంచి అర్జీ అందగా తమ పొలం సర్వే రిపోర్ట్ మంజూరు చేయాలని అరవపల్లి గ్రామం నుంచి ఒకరు అర్జీ అందించారని చెప్పారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



రేపల్లె రూరల్: రేపల్లె రూరల్ సీఐగా ఎ.మల్లికార్జునరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తాడేపల్లి సీఐగా విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎ.శివశంకర్ వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావును ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం నూతన సీఐ మల్లికార్జునరావుకు రూరల్ సర్కిల్ కార్యాలయ సిబ్బంది, కార్యాలయ పరిధిలోని చోడాయపాలెం, నిజాంపట్నం, చెరుకుపల్లి, అడవులదీవి, నగరం పోలీస్ స్టేషన్‌ల ఎస్ఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

తుపాను బాధితులకు సాయం



రేపల్లె రూరల్: మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన పెనుమూడి గ్రామంలోని బాధితులకు లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం చేయూతనందించారు. గ్రామంలోని 70 మంది కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా చైర్మన్ కాటూరి శివనాగబాబు, క్లబ్ సభ్యులు ఎస్.శరత్‌బాబు, ఎ.రామారావు, ఆర్‌సీ రఘుపతిరావు, కాటూరి వెంకట్రావు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

ప్రత్తిపాడు: తుమ్మలపాలెం పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి చెందిన సర్పంచ్ నాగమల్లేశ్వరితో పాటు మరికొందరు పంచాయతీ కార్యవర్గ సభ్యులు సోమవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. గుంటూరు రూరల్ మండలంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులో ఉన్న వైసీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ సమక్షంలో సోమవారం రాత్రి సర్పంచ్ చల్లా నాగమల్లేశ్వరి, ఉప సర్పంచ్ మామిడి ఎమీమాలతో పాటు వార్డు సభ్యులు చల్లా మణికంఠ, పోతురాజు సామ్రాజ్యం, పోతురాజు రాజ్యలక్ష్మి, కట్టెబోయిన కోటేశ్వరమ్మ, కట్టెబోయిన లక్ష్మీనారాయణ, గుమ్మా ఇక్కయ్యలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి ఇన్‌చార్జి బలసాని పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీలో న్యాయం జరుగుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్ అండగా నిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ, తుమ్మలపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు జమ్ముల వీరభద్రరావు, కందుల గంగారావు పాల్గొన్నారు.

రామనామంతో పులకించిన పురవీధులు

- ఘనంగా శోభాయాత్రలు
- అయోధ్యలో జరిగిన వేడుకలను వీక్షించేందుకు ఆలయాల వద్ద భారీ తెరలు ఏర్పాటు



కోలాట భజన చేస్తున్న విద్యార్థులు



ద్విచక్ర వాహన ర్యాలీ చేపడుతున్న భక్తులు

కొల్లూరు: అయోధ్య శ్రీరామ మందిర విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని కొల్లూరు మండలంలోని పలు గ్రామాలలో శ్రీరామ నామ స్మరణ మార్మోగింది. సోమవారం ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో రామాలయాలకు తరలి వెళ్లి దైవ దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోలాహలంతో రామాలయాలు కిటకిటలాడాయి. మండలంలోని ఆవులవారిపాలెం, క్రాప గ్రామాలలో అధిక సంఖ్యలో భక్తులు శ్రీరాముడికి సామూహిక పూజలు నిర్వహించి తమ భక్తి శ్రద్ధలు చాటుకున్నారు. కొల్లూరులో భక్తులు శివారులోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద నుంచి లాక్ సెంటర్ మీదుగా బస్టాండ్ సెంటర్‌లోని శివాలయం వరకు కాషాయ జెండాలు చేతబూని సుమారు 4 కిలోమీటర్ల మేర శోభయాత్ర నిర్వహించారు.

వేడుకగా శోభాయాత్ర

రేపల్లెరూరల్: అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో రామ భక్త బృందం ఆధ్వర్యంలో పురవీధుల్లో శోభాయాత్ర కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సీతారామ లక్ష్మణ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి ఓల్డ్‌టౌన్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నుంచి శోభయాత్ర ప్రారంభించారు. భక్తులు రాముని ప్రతిమ కలిగిన కాషాయపు జెండాను ప్రదర్శిస్తూ పురవీధుల్లో శ్రీరామ నామాన్ని జపిస్తూ ఇసుకపల్లిలోని రామశాస్త్రి కల్యాణ మండపం వరకు యాత్రను కొనసాగించారు. దీంతో శ్రీరామ నామ జపంతో పట్టణ ప్రాంతమంతా మార్మోగింది. అనంతరం భక్తులకు రామభక్త బృంద సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, కౌన్సిలర్ బొలిశెట్టి సత్యనారాయణ, నాయకులు మద్ది బదిరీ నారాయణమూర్తి, బీఎల్ శ్రీనివాస్, తడవర్తి విజయ్‌కుమార్, నంబూరి సత్యప్రసాద్, యెండూరి రాజేష్, మట్టుపల్లి సుబ్బారావు, చింతల సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐలవరంలో హనుమాన్ చాలీసా ఏకాహం

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో సమరసత సేవా ఫౌండేషన్, నగర సంకీర్తన సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఏకాహంగా శ్రీరామ జయ రామ, హనుమాన్ ఛాలీసా పారాయణం జరిగింది. రాచూరు జమిందార్ సహకారంతో సోమవారం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. రామ్ శివాజీ యూత్ ఆధ్వర్యంలో కాషాయం జెండాలతో శోభాయాత్ర, రథోత్సవ కార్యక్రమం జరిగింది. గ్రామంలోని అన్ని రామాలయాల్లో దీపోత్సవం, భజన సంకీర్తనలు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, నిర్వాహకులు వి. కోటేశ్వరరావు, కేబీవీ రమణ, డి.సత్యన్నారాయణ, ఎం. రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో ఆకట్టుకున్న అలంకరణ

భట్టిప్రోలు: అయోధ్య రామ మందిరంలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని భట్టిప్రోలు విఠలేశ్వరనగర్ రామ మందిరంలో స్వామి వారి అలంకరణ సోమవారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా శ్రీరామ చంద్రమూర్తికి అర్చనలు, శ్రీరామ రక్షా స్తోత్రము, సుందరకాండ, హనుమాన్ చాలీసా పారాయణ గావించారు. రాత్రికి అఖండ దీపారాధన నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వాసవీ క్లబ్, వాసవీ క్లబ్ కుబేర వనిత ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమాలను క్లబ్ నిర్వాహకులు పర్యవేక్షించారు.



పూజలు నిర్వహిస్తున్న క్లబ్ నిర్వాహకులు



శోభా యాత్రను నిర్వహిస్తున్న భక్తులు

అలరించిన కోలాట భజన

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో కొలువైన శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి అర్చనలు, అభిషేకాలు జరిపించారు. అనంతరం అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రత్యేకంగా టెలివిజన్ ఏర్పాటు చేశారు. దేవాలయం ప్రాంగణంలో పిట్టువారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో ఏర్పాటు చేసిన మురళీ కృష్ణ కోలాట భజన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కోలాట భజన మాస్టర్ పులుగు సముద్రాలరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం చూపరులను ఆకట్టుకుంది.

రామ నామంతో పులకించిన గ్రామాలు

పిట్టలవానిపాలెం: మండలంలోని అన్ని గ్రామాలు సోమవారం శ్రీరామ నామస్మరణతో మారుమ్రోగాయి. ఆయా గ్రామాలలోని రామాలయాలలో స్థానిక మహిళలు రామ నామ సంకీర్తనలు ఆలపించారు. అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం తిలకించేందుకు కొన్ని గ్రామాలలోని దేవాలయాలలో టెలివిజన్‌లు ఏర్పాటు చేశారు. ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం, గ్రామాలలో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, ధనుంజయరాజు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు.

వాడవాడలా మార్మోగిన రామనామం

కర్లపాలెం: అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ జరిగిన సందర్భంగా కర్లపాలెం మండలంలోని పలు గ్రామాలలో శ్రీరామనామం మార్మోగింది. అయోధ్య శ్రీరాముని ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా కర్లపాలెం శ్రీ వీరభద్ర స్వామి సమేత కాళికాంబ అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అమ్మవారి ఆలయంలో విశేష పూజలు చేశారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు, శ్రీరామ భక్తులు హనుమంతుని జెండాలు చేతబట్టి జై శ్రీరామ్ అంటూ కర్లపాలెంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలు, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. యాజలి గ్రామంలో బాపట్ల కాపు సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు, నా జన్మభూమి ట్రస్ట్ అధ్యక్షుడు గుడిశా బ్రహ్మయ్య, గ్రామపెద్దల ఆధ్వర్యంలో గ్రామంలో శ్రీరాముని చిత్రపటాలతో శోభాయాత్ర నిర్వహించి భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కర్లపాలెం పంచాయతీ ఎంవి రాజుపాలెం గ్రామపెద్దల ఆధ్వర్యంలో యువకులు సుమారు 250 ద్విచక్ర మోటారు వాహనాలతో మండలంలోని పలు గ్రామాలలో శోభాయాత్ర నిర్వహించారు. హైవెండ్ హైస్కూల్‌లో జరిగిన వేడుకలలో విద్యార్థులు జైశ్రీరామ్ ఆకారంలో కూర్చుని భక్తి గీతాలు ఆలపించారు. జై శ్రీరామ్ ఆకారంలో దీపాలను వెలిగించారు. మేస్త్రి నాగిరెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు ద్విచక్ర మోటారు వాహనాలతో శోభాయాత్ర నిర్వహించారు.



ఐలవరంలో హనుమాన్ చాలీసా ఏకాహంలో పాల్గొన్న భక్తులు



సీతారాముల చిత్ర పటంతో ఊరేగింపు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ట్యాబ్‌ల పంపిణీ

తెనాలి: ప్రత్యేక అవసరాలు గల పిల్లల సమగ్ర విద్య కోసం ప్రభుత్వం అందజేస్తున్న విద్యా అవసరాల్లో భాగంగా మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ సోమవారం సాయంత్రం ఇద్దరు విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. రూరల్ మండలం ఖాజీపేట జెడ్పీ హైస్కూలులో 10వ తరగతి చదువుతున్న వినికిడిలోపం కలిగిన కె.నాగేంద్ర వరుణ్, తెనాలి గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ హైస్కూల్లో చదువుతున్న దృష్టిలోపం కలిగిన కె.బాలమణికంఠకు వీటిని అందజేశారు. ఎంఈవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న బాలాజీరావుపేట భవిత సెంటర్లోని విద్యార్థుల అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం సహాయ పరికరాలు, బోధనాభ్యసన సామగ్రి, ఎస్కార్ట్ అలవెన్సులు అందజేస్తున్నట్టు గుర్తుచేశారు. ఇందులో భాగంగానే అత్యంత నాణ్యత కలిగిన ట్యాబ్‌లను అందజేశామన్నారు. వీరికి డిజిటల్ విధానం ద్వారా అభ్యసన సామర్థ్యాలను పెంచుకునేలా బోధన జరుగుతుందన్నారు. సమ్మిళిత విద్యలో భాగంగా వైకల్యం కలిగిన వారు సైతం స్క్రీన్ చూడటం, వినడం ద్వారా పాఠాలను చక్కగా నేర్చుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో-2 జయంత్‌బాబు సూచించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయినులు వై.రాజకుమారి, డి.సునీత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుల దూషణపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కృష్ణనగర్ 5వ లైనులో నిర్మాణంలో ఉన్న భవన వాచ్‌మన్ కాశయ్యతో పక్కనే నివాసం ఉండే చిట్యాల రవికిరణ్ గొడపడ్డాడు. కాశయ్యను కులం పేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సంపత్‌నగర్ 5వ లైనులో నివాసం ఉండే పి.వెంకటేష్ (23) సోమవారం షోడా బండికి విద్యుత్ చార్జింగ్ పెడుతూ ప్రమాద వశాత్తు షాక్ తగిలి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

ఎమ్మెల్యే కోన రఘుపతి



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రఘుపతి

పేరలి(కర్లపాలెం): ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల లాంటివని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. పేరలి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద జరిగిన సభలో గ్రామంలోని పింఛన్ల లబ్ధిదారులకు కోన చారిటబుల్ ట్రస్ట్ తరఫున దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఒకవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళుతున్నారని చెప్పారు. కోన చారిటబుల్ ట్రస్ట్ తరఫున పేదలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రఘుపతి అన్నారు. సినీ రచయిత కోన వెంకట్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా అవ్వటమే కాకుండా మెడికల్ కళాశాల నిర్మాణం కూడా వేగంగా జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు, పార్టీ నాయకులు కాగిత బుల్లియ్య, అక్కల శ్రీనివాసరెడ్డి, ఎస్‌కె ఆసిఫ్ అలీ, మరకా పెద వెంకటేశ్వర్లు, మందపాటి పరమానందకుమార్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, యారం ఇసాక్, గొర్రుముచ్చు మీర య్య, ధర్మేంద్ర, అర్జున్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పార్టీ గెలుపు కోసం నిరంతర కృషి చేద్దాం

నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి



సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి

వేమూరు: నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిగా పని చేయాలని నియోజకవర్గం సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు.సోమవారం మార్కెట్ యార్డులో కార్యకర్తల మండల స్థాయి విస్తృత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ద్వారా అనేక కుటుంబాలు అభివృద్ధి చెందడం జరిగిందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు మేరకు పరిపాలన అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, గ్రామ సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. పేద వర్గాలకు చెందిన ప్రజలు మరల సంక్షేమ పథకాలు పొందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించు కోవాలని ఆయన కోరారు. నియోజక వర్గం బూత్ కమిటీ కన్వీనర్‌గా అనపరెడ్డి వీరారెడ్డిని ప్రకటించారు. బూత్ కమిటీల పూర్తి బాధ్యతను వీరారెడ్డి వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చందోలు డేవిడ్ విజయకుమార్, ఎంపీపీ యల్లమాటి మోహన్ మండల పార్టీ కన్వీనర్ బొల్లిముంత ఏడుకొండలు, మండల సచివాలయం కన్వీనర్ దాది సుబ్బారావు, సొసైటీ అధ్యక్షులు భాను ప్రకాశ్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అక్కినేని

వర్ధంతి సభలో వక్తలు



అక్కినేని చిత్రపటానికి నివాళి

తెనాలి: పట్టణానికి చెందిన స్వరలయ వేదిక ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు 10వ వర్ధంతి సదస్సును నిర్వహించారు. స్థానిక మారీసుపేటలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటైన సదస్సులో అక్కినేని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అక్కినేని జీవిత విశేషాలను సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు వెల్లడించారు. బాలనటుడిగా, స్త్రీ పాత్రల్లో నటిస్తూ సినీరంగ ప్రవేశం చేసిన అక్కినేని తన అభినయ కౌశలంతో నటసామ్రాట్‌గా పిలిపించుకున్నారని చెప్పారు. 256 సినిమాల్లో నటించారని, 'మనం' సినిమా చివరిదని అన్నారు. తెలుగు సినిమా ఉన్నంతకాలం ఆయన చిరస్మరణీయులని చెప్పారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ విశ్రాంత సీఈవో డి.సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులను అందుకున్న గొప్ప నటుడని తెలిపారు. శ్రీధర్, నటులు మల్లేశ్వరరావు, హేమాచారి, పినపాటి సురేష్‌బాబు, రొంపిచర్ల సురేష్, జవ్వాది ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రేపల్లె డివిజన్ ఓటర్ల వివరాలు వెల్లడి



ఆర్డీవో హేలా షారోన్

రేపల్లె రూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రేపల్లె రెవిన్యూ డివిజన్ పరిధిలోని ఓటర్ల వివరాలను ప్రకటించినట్లు ఆర్డీవో హేలా షారోన్ తెలిపారు. స్థానిక రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం ఆమె వివరాలను తెలియజేశారు. డివిజన్‌లో మొత్తంలో 4,22,322 మంది ఓటర్లు ఉండగా, అందులో 2,05,946 మంది పురుషులు, 2,16,347 మంది మహిళలు, 29 మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారన్నారు. రేపల్లె నియోజకవర్గంలో 2,26,566 మంది ఓటర్లు ఉండగా అందులో 1,11,071 మంది పురుషులు, 1,15,475 మంది మహిళలు, 20 మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారన్నారు. వేమూరు నియోజకవర్గంలో 1,95,756 మంది ఓటర్లు ఉండగా 94,875 మంది పురుషులు, 1,00,872 మంది మహిళలు, 9 మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారన్నారు. ఆయా మండలాలకు సంబంధించిన ఓటర్ల జాబితాలు తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు.

రహదారులకు మరమ్మతులు

- సొంత ఖర్చుతో పనులు చేపడుతున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కొల్లూరు : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా నిస్వార్థ సేవలు అందించాలన్న సంకల్పంతో సొంత ఖర్చులతో రహదారుల మరమ్మతులు చేపడుతున్నట్లు వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని బొద్దులూరుపాడు జెడ్పీ రహదారి దశాబ్దాలు తరబడి నిర్మాణానికి నోచుకోకపోవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మెటల్ డస్ట్‌తో గతంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే వర్షాల కారణంగా రహదారి తిరిగి అస్తవ్యస్తంగా మారడంతో రహదారి పరిస్థితిని గమనించిన వరికూటి స్థానికుల విన్నపాలను పరిగణనలోకి తీసుకొని తన సొంత ఖర్చులతో రహదారి మరమ్మతుల పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు 3 కిలోమీటర్ల పొడవున గతుకుల మయంగా మారిన రహదారిని ప్రొక్లేన్ సాయంతో సరిచేయించడంతో పాటు, రూ.5 లక్షల అంచనా వ్యయంతో మెటల్ వేయించి రోడ్డు మరమ్మతులు జరిపిస్తున్నారు. దీంతో గ్రామస్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. బొద్దులూరుపాడు రోడ్డుతో పాటు మండలంలోని దోనేపూడి కరకట్ట దిగువ నుంచి పోతార్లంక అడ్డు రోడ్డు వరకు అధ్వానంగా మారిన జెడ్పీ రోడ్డును సైతం రూ.2 లక్షలు వెచ్చించి మరమ్మతులు జరిపించారు. తిప్పలకట్టలో రూ.50 వేలు ఖర్చు చేసి రోడ్ల వెంబడి అలుముకుపోయిన చెట్లను తొలగించడంతో పాటు, స్మశాన వాటికలో విద్యుత్తు మోటరు సదుపాయం కల్పించారు. దీంతో గ్రామాల్లో సమస్యలకు పరిష్కారం లభించినట్లయింది.

నేడు జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరం

భట్టిప్రోలు: మండలంలోని ఐలవరం-2 సచివాలయం పరిధిలో గల పద్మశాలీయ కల్యాణ మండపంలో మంగళవారం జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు సోమవారం తెలిపారు. ఈ క్యాంప్‌లో పీహెచ్‌సీల వైద్యులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ స్పెషలిస్ట్ డాక్టర్లు, కంటి వైద్య నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటు ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని వివరించారు.

30 నుంచి సువార్త స్వస్థత మహాసభలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

తెనాలి: క్రైస్ట్ టెంపుల్ ఆధ్వర్యంలో ఈనెల 30, 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో తెనాలిలో సువార్త స్వస్థత మహాసభలను నిర్వహించనున్నారు. మారీసుపేట రెండు గేట్ల మధ్య గల సెయింట్‌పాల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సోమవారం సాయంత్రం మహాసభల వాల్‌పోస్టర్‌ను రెవరెండ్ మేకల సునీల్, బ్రదర్ కూచిపూడి ప్రేమ్‌సాగర్ ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకు సభలు ప్రారంభిస్తారని చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో, విజయవాడ ప్రాంతంలో దైవసేవలో గుర్తింపును పొందిన క్రైస్ట్ టెంపుల్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్ ఇమ్మానుయేల్, సిస్టర్ నిస్సిపాల్ సువార్త సభలో వాక్య పరిచర్య చేస్తారని తెలిపారు. ప్రముఖ సంగీత గాయకులతో ప్రత్యేక స్తుతి ఆరాధన ఉంటుందన్నారు. తెనాలి, పరిసరాల్లోని క్రైస్తవులంతా పాల్గొని దైవ ఆశీర్వాదం పొందాలని కోరారు. సొపాటి కిరణ్, చావలి అకుల్ నాథ్, చావలి తేజోనాథ్, బొంత ప్రేమ్, పినపాటి కొండలరాజు, కలెవరపు వినోద్, తోట శ్రీనివాసరావు, వేమూరు రవి, ఆలపాటి సుధీర్, పినపాటి సునీల్‌పాల్ పాల్గొన్నారు.

తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ

పెదకాకాని: పెదకాకాని గ్రామంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు జరుగుతున్నాయి. పెదకాకాని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పెండ్యాల శ్రీధర్ లారీ డ్యూటీకి వెళ్లాడు. గత శుక్రవారం ఆయన భార్య దుర్గ రాజమండ్రి పుట్టింటికి వెళ్ళింది. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గుర్తించిన గుర్తు తెలియని దొంగలు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువా తీసి అందులో ఉన్న బంగారు వస్తువులు దొంగిలించారు. ఇంటి ఆవరణలో ఉన్న స్కూటీని దొంగిలించారు. సోమవారం ఇంటికి వచ్చిన దుర్గ తలుపులు తీసి ఉండటాన్ని గుర్తించి ఇంటిలోనికి వచ్చి చూసే సరికి బీరువా తెరచి అందులో ఉన్న వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. ఇంటిలో దొంగలు పడి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెదకాకాని: జాతీయ రహదారిపై వెళుతున్న బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీ కొన్న సంఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న షేక్ రజియా మృతి చెందగా ఆమె భర్త, పిల్లలకు గాయాలయ్యాయి. పెదకాకాని పోలీసుల కథనం ప్రకారం గుంటూరుకు చెందిన షేక్ బాబర్‌కు భార్య రజియా, కుమారుడు అక్బర్, కుమార్తె సాంగినా సంతానం. షేక్ బాబర్ ఆదివారం విజయవాడలో ఉంటున్న తన చెల్లెలు ఇంటికి భార్య, పిల్లలతో స్కూటీపై బయలు దేరాడు. వారు ప్రయాణిస్తున్న స్కూటీ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న పాస్టరల్ ట్రైనింగ్ సెంటర్ సమీపంలోకి చేరుకునే సరికి వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీ కొంది. ఈ ఘటనలో స్కూటీపై ప్రయాణిస్తున్న షేక్ రజియా(37)పై లారీ చక్రాలు ఎక్కి అక్కడికక్కడే మృతి చెందగా భర్త బాబర్, కుమారుడు అక్బర్, కుమార్తె సాంగినాలకు గాయాలయ్యాయి. బంధువులకు సమాచారం అందించి ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆదివారం రాత్రి పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు షేక్ బాబర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వినోద్‌బాబు తెలిపారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం రజియ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.